రమాయణం

**అప్పట్లో పెళ్లిళ్లు ఎండకాలంలోనే జరుగుతుండేవి. ఎక్కువ శాతం వ్యవసాయ కుటుంబాలే ఉండేవి గనుక.. ఆ కాలంలో కాస్త పనులు తగ్గి, తీరిగ్గా ఉండేవారని అలా చేసేవారేమో! తాటాకు పందిళ్లు వేయడం వల్ల చల్లగా ఉండేది. ఆ రోజుల్లో ఇంతలా ఎండలు లేవేమో కూడా!**

# సొమ్ముల పెట్టె పోయెరా..



నేను ఎనిమిదేళ్ల పిల్లగా ఉన్నప్పుడు మే నెలలో మా దగ్గరి బంధువుల పెళ్లిళ్లు వచ్చాయి. అమ్మ మేనవదిన కూతురు పెళ్లి రాయపర్తిలో, ఆ తరువాత ఐదు రోజులకు మా మేనత్త కూతురు పెళ్లి మా ఊరిలో. ఇద్దరూ వదినలే! మొదటి పెళ్లి మా సెకండ్ కజిన్‌ది అయినా.. మా అమ్మా, వాళ్లమ్మా ఒకే ఇంట్లో అక్కచెల్లెళ్లలా పెరిగారు గనుక అది కూడా దగ్గరి పెళ్లే! ఇటు చూస్తే అమ్మకు ఆడబిడ్డ కూతురి పెళ్లి గనుక అమ్మ ఉండటం ఇక్కడ కూడా తప్పనిసరి.

మా ఆనందం ఏమిటంటే ఆ సందర్భంగా అక్కకూ నాకూ చెరి మూడు జతల బట్టలు కొన్నాడు నాన్న. పైగా సెలవులు.. ఎంజాయ్ చేయొచ్చు కదాని. సినిమాల్లో హీరోహీరోయిన్లు డాన్సు చేస్తున్నట్టు పక్కనున్న స్నేహితులకే కలలు వచ్చినట్టు.. ఓ వారం ముందు నుంచే నిద్ర పోయినా నాకు ఆ పెళ్లిళ్ల కలలే వచ్చేవి.

మొత్తానికి పెళ్లి మూడు రోజులు ఉందనగా ఓరోజు తొందరగానే భోజనాలు చేసి బయల్దేరాం నేనూ, అక్కా, అమ్మా. మాతోపాటు మా ఊళ్లోనే ఉండే లక్ష్మి చిన్నమ్మ కూడా వచ్చింది. నాన్నేమో.. పెళ్లి రోజుకల్లా వస్తానని, ఇక్కడ మా అత్తయ్య వాళ్లింట్లో పెళ్లిపనుల కోసం ఆగిపోయాడు. ముందుగా మా ఊరు నుంచి వరంగల్ బస్సులో వెళ్లి హనుమకొండ చౌరస్తాలో దిగి, అక్కడ మళ్లీ ఖమ్మం వెళ్లే బస్సు ఎక్కితే రాయపర్తిలో దిగొచ్చు.

తీరా హనుమకొండలో దిగాక లక్ష్మి చిన్నమ్మ.. ''నేను మా అమ్మ వాళ్లింటికి పొయ్యి ఒకట్రెండు చిన్న పనులు చూసుకోని మళ్ల రేపు రాయపర్తికి ఒస్త. పిల్లలిద్దర్ని నాతోటి పంపండి అక్కయ్యా! 'దసరా బుల్లోడు' సిన్మా బాగుందంటున్నరు. వీళ్లకు చూపిచ్చి నాతోని రేపు తీసుకొస్త'' అన్నది. అమ్మకు ఏమనాలో తోచనట్టుంది. మొహమాటంతో.. ''ఎందుకులే! పిల్లలతోని నీకు తిప్పలు'' అన్నది. ''ఎహె! నాకేం తిప్పలు అక్కయ్యా! నేనేమన్న వాళ్లను ఎత్తుకోని మోసేదుందా?! అయినా మీ పిల్లలు బుద్ధిమంతులు'' అన్నది చిన్నమ్మ. నేను అలాంటప్పుడు వీలైనంత అమాయకంగా మొహం పెడుతుంటాను. నిజానికి సినిమాలు చూడాలని నాకుగానీ, అక్కకు గానీ పెద్దగా ఉండేది కాదు. హైదరాబాద్ వెళ్లినపుడు అమ్మా, చిన్నమ్మలు వెళ్లినా మేము ఇంట్లోనే ఉండి ఆడుకునేవాళ్లం. అమ్మతోపాటే వెళ్లాలని ఉన్నా.. చిన్నమ్మ మరీ అంతలా అడుగుతుంటే బావుండదని.. అమ్మ సరేనడంతో మాకు ఆరోజు ఉండక తప్పలేదు.

అమ్మ మాకు మరో సంచిలో చెరొక డ్రెస్ పెట్టి తను మిగతా లగేజీ తీసుకుని వెళ్లింది. మేము ఎటుపోయినా మాకు సహాయంగా నర్సయ్య వచ్చేవాడు. నర్సయ్యను 'నర్సీ' అనేవాళ్లం. వాళ్ల తల్లిదండ్రులకు చాలామంది సంతానం ఉండటం వల్ల పదిహేనేళ్ల నర్సిని మా ఇంట్లో ఉంచుకోమని నాన్నను బతిమిలాడితే.. సరేనన్నాడట. అందుకని మా ఇంట్లోనే ఉండేవాడు.

'దసరా బుల్లోడు'లో నాగేశ్వరరావు, పద్మనాభం బృందం సూర్యకాంతంను అల్లరిపెట్టడం, నాగభూషణంను ఏడిపించడం, జోకులు.. ఇవే నాకు నచ్చాయి. ఆ ప్రేమలూ, త్యాగాలూ ఏమీ అర్థంకాలేదు. పైగా వాణిశ్రీ పాటల్లో మాటిమాటికీ కొంగు తీస్తుంటే.. 'ఇదేందీ! మా నానమ్మ అయితే ఎవరైనా కొంగు తీస్తే చాలు.. వాళ్ల దుమ్ము దులుపుతుంది. ఈమెందుకో మరి అలా చేస్తుంది?!' అనుకున్నాగానీ పైకి అనలేదు.

ఆ రోజు సినిమా చూసి లక్ష్మి చిన్నమ్మ వాళ్ల అమ్మ వాళ్లింట్లో ఉండి.. మర్నాడు పొద్దున్నే ముగ్గురం రాయపర్తికి బయల్దేరాం. అక్కడికి చేరేసరికి ఇల్లంతా పెళ్లిసందడితోబాటు మరో హడావుడి కనిపించింది. అందరూ అమ్మ చుట్టూచేరి.. ''అరె! గట్లెట్ల అయింది?! మొదలు చూసుకోలేదా?!'' అనీ.. ''వామ్మో! ఎంత పనయింది?!'' అనీ.. ''సొమ్ములన్నీ ఒక్కదాంట్లనే పెట్టినవా?! గట్ల ఎప్పుడు పెట్టుకోవొద్దు. అండ్లొకటి ఇండ్లొకటి పెట్టుకోవాలె'' అనీ.. ''అయినా పనోండ్ల మీద వొదిలి పెట్టొద్దు. నువ్వే పెట్టె దింపుకొంటె అయిపోవు''.. ఇలా ప్రశ్నల మీద ప్రశ్నలు గుప్పిస్తున్నారు.

ఒక్కరోజుకే బెంగేసి అమ్మను గట్టిగా పట్టుకున్నాను. ఏమైందని అమ్మను అడిగితే తెలిసిందేమిటంటే.. ఓ పెద్ద సంఘటన జరిగిందని. అమ్మ బస్సు దిగి పెళ్లింట్లోకి వెళ్లి.. కొద్దిసేపటికి స్నానం చేద్దామని పెట్టె తాళం తీయబోతే ఎంతకూ రావడం లేదట. మళ్లీ మళ్లీ ప్రయత్నించాక ఎందుకో అనుమానం వచ్చిందట.. అది తన పెట్టె కాదేమోనని. అక్కడున్న మగవాళ్లెవరో ఆ సందూక తాళం పగులగొట్టి చూశారట. అందులో ఒక జత మగవాళ్ల బట్టలు, ఓ సుత్తె, ఇంకా కొన్ని పనిముట్లు ఉన్నాయట.

బస్సులోంచి దిగేటప్పుడు అమ్మ తన చేతిలో ఓ బ్యాగు పట్టుకుని దిగితే.. పైనున్న సందూకను నర్సి తీసుకొచ్చాడట. అలా దింపేటప్పుడు మనదే అనుకుని ఆ పక్కనే అలాగే ఉన్న వేరెవరిదో పెట్టె తెచ్చాడని నిర్ధారణ అయింది. అలా.. మా సొమ్ముల పెట్టె పోయింది.

మరి అది ఎలా దొరికింది? దానికోసం ఎవరు ఎలాంటి సాహసం చేశారో.. వచ్చేవారం! ■



**నెల్లుట్ల రమాదేవి**
**రచయిత్రి**